వైభవంగా చౌడేశ్వరి రథోత్సవం





ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరి అమ్మవారి మూలవిరాట్.. భారీ జనం మధ్య కదులుతున్న రథం
హాజరైన భక్తులు

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 12: మండలంలోని కొటిపి గ్రామదేవత చౌడేశ్వరీదేవి రథోత్సవం శుక్రవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఉంచి, ప్రాకారోత్సవం నిర్వహించారు. అనంతరం రథంపై ప్రతిష్ఠించి, ఊరేగించారు. యువత కేరింతలు, భక్తిశ్రద్ధలతో రథాన్ని ఊరి చివర వరకు లాగారు. మూలవిరాట్‌ను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. రథోత్సవానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. మేళతాలాలు, డప్పు మోతలతో ఆలయ ప్రాంగణం మార్మోగిపోయింది.

నేటి నుంచి బాలయ్య బస్సుయాత్ర

కదిరి నుంచి ప్రారంభం




స్వర్ణాంధ్ర సాకార యాత్రకు సిద్ధమైన బస్సు

పుట్టపర్తి, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ బస్సుయాత్రకు సిద్ధమయ్యారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్వర్ణాంధ్ర సాకార యాత్ర పేరుతో తలపెట్టిన బస్సుయాత్రకు శనివారం కదిరిలో శ్రీకారం చుట్టనున్నారు. జిల్లాలోపాటు అనంత, కర్నూలు జిల్లాల్లో బాలకృష్ణ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. శనివారం ఉదయం 9 గంటలకు హెలికాప్టర్‌లో బాలకృష్ణ కదిరికి చేరుకుంటారు. తొలుత ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. 9.40 గంటకు అలమ్‌ఖాన్‌వలి దర్గాలో పార్థనల్లో పాల్గొంటారు. 10 గంటలకు పీవీఆర్ ఫంక్షన్ హాల్‌కు చేరుకుని, నాలుగు గంటలదాకా అక్కడే ఉంటారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 దాకా కదిరి జీవిమాను సర్కిల్‌లో జరిగే బహిరంగసభలో బాలకృష్ణ ప్రసంగిస్తారు. అక్కడి నుంచి బస్సుయాత్ర ప్రారంభమై పుట్టపర్తి నియోజకవర్గం నల్లమాడ మండలం బొగ్గలపల్లి, నల్లమాడ మీదుగా సాయంత్రం 6గంటలకు కొత్తచెరువుకు చేరుకుంటుంది. సెర్పాసా సర్కిల్‌లో నిర్వహించే బహిరంగ సభలో ప్రసంగిస్తారు. రోడ్డు మార్గాన రాత్రి 8.20కి అనంతపురం చేరుకుని, బళ్లారి రోడ్డులోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో బస చేస్తారు. బాలయ్య అన్‌స్టాపబుల్ స్వర్ణాంధ్ర సాకార యాత్రను విజయవంతం చేసేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి శ్రేణులు పెద్దఎత్తున సన్నాహాలు చేస్తున్నారు.

తనిఖీల్లో పట్టుబడితే వదులుకోవాల్సిందే
జంకుతున్న చిరువ్యాపారులు
స్తంభించిన వ్యాపారం
ఎక్కడి చీరలు అక్కడే?
ఇబ్బందుల్లో నేతన్నలు

కోక కష్టం!

పట్టుచీరల విక్రయంపై
కోడ్ ఎఫెక్ట్


ఇంట్లో నిల్వ ఉంచుకున్న చీరలు

హిందూపురం, ఏప్రిల్ 12: ఎన్నికల కోడ్ పట్టుచీరల విక్రయాలపై పెను ప్రభావం చూపుతోంది. చీరలు కొనేందుకు డబ్బు తీసుకెళ్లలేని పరిస్థితి నెలకొంది. అలాగే.. కొన్న చీరలను తరలించాలన్నా ఇబ్బందే. బిల్లులు తప్పనిసరి. బిల్లు లేకుండా తరలిస్తూ పట్టుబడితే వాటిని వదులుకోవాల్సిందే. తక్కువ వ్యాపారం చేసేవారికి బిల్లులు ఇవ్వరు. దీంతో రవాణా సమయంలో తనిఖీల్లో పట్టుబడి బిల్లులు లేకపోతే వదులుకోవాల్సిందే. దీంతో పట్టుచీరల వ్యాపారంపై ఎన్నికల కోడ్ ఎఫెక్ట్ బలంగా పడింది. మార్చి 16న ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి పట్టుచీరల వ్యాపారంపై ప్రభావం చూపుతోందని వ్యాపారాలు లబోదిబోమంటున్నారు. హిందూపురం పట్టణ పరిధిలోని ముద్దిరెడ్డిపల్లిలో నిత్యం వేల సంఖ్యలో మరమగ్గాలపై చీరలు తయారవుతాయి. ఇక్కడ తయారైన చీరలు ఎక్కువగా కొనుగోలు చేసేవారు బిల్లులు దగ్గర పెట్టుకొని తరలిస్తారు. తక్కువగా తయారుచేసి అమ్మేవారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో చీరల వ్యాపారం చేసే చిరు వ్యాపారులు అవస్థలు పడుతున్నారు.

చిరువ్యాపారులకు పెద్ద కష్టం

సాధారణంగా 300 చీరలకుపైగా కొనుగోలు చేస్తే వ్యాపారులు అందుకు తగ్గట్టుగా బిల్లులు ఇస్తారు. ఆ స్థాయిలో కొనుగోలు చేసే వ్యాపారులు జీఎస్టీతో అనుసంధానమై ఉంటారు. దాంతో వారికి ఎలాంటి ఇబ్బందీ ఉండదు. ముద్దిరెడ్డిపల్లిలో వేల సంఖ్యలో మగ్గాలు ఉన్నా చాలామంది వ్యాపారులు ఐదు నుంచి పది మగ్గాలలోపే ఉన్నాయి. వీరు వారం వారం తయారైన చీరలను ధర్మవరం, బెంగళూరుకి తరలించి, విక్రయాలు చేస్తుంటారు. వీరు పదిహేనులోపే చీరలను విక్రయిస్తుంటారు. దీనికి బిల్లులు ఇవ్వరు. దీంతో వాటిని తరలించే సమయంలో గానీ, నగదు తీసుకొచ్చే సమయంలోగానీ పట్టుబడితే పరిస్థితి ఏమిటని వ్యాపారులు జంకుతున్నారు. తనిఖీల్లో చీరలు గానీ, నగదు గానీ పట్టుబడితే అందుకు సంబంధించిన బిల్లులు ఉండని కారణంగా వాటిని వదులుకోవాల్సి వస్తుంది. దీంతో వ్యాపారానికే వెళ్లకుండా మిన్నకుండిపోతున్నారు.

ఎక్కడి చీరలు అక్కడే..

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పట్నుంచి ముద్దిరెడ్డిపల్లిలో ఎక్కడి చీరలు అక్కడే ఉండిపోయాయి. సుమారు 50 వేల చీరలు నిలిచిపోయినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. మరో 50 రోజులు ఎన్నికల కోడ్ ఉండటంతో అప్పటి వరకు తమ పరిస్థితి ఏంటని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఉత్పత్తి తగ్గించడమే మేలనీ, లేకపోతే ముడిసరుకు, చీరలు నేసే నేతన్నలకు కూలి ఇవ్వడానికి ఉండదని భావిస్తున్నారు. చీరల ఉత్పత్తి తగ్గితే సరఫరా పడిపోతుంది. పర్యవసానంగా మార్కెట్‌లో ధరలు కూడా పెరిగే అవకాశం ఉంటుందనీ, కృత్రిమ కొరత ఏర్పడవచ్చని వ్యాపారులు భావిస్తున్నారు.



ఇబ్బందుల్లో నేతన్నలు

ఎన్నికల కోడ్ నెల రోజులుగా అమలులో ఉండటంతో ఇప్పటి వరకు ఉత్పత్తైన చీరలకు కూలి డబ్బు ఇవ్వలేక ఇబ్బంది పడుతూ, చీరలు అమ్ముకోలేక ముడిసరుకు డబ్బు చెల్లించలేక చేనేతలు ఇబ్బంది పడుతున్నారు. ఎన్నికల కోడ్ 50 రోజులు ఉండటంతో అప్పటి వరకు మగ్గాలు నడపడం ఎలా? ఉన్న నిల్వలను విక్రయించుకోవడం ఎలా అనే ఆలోచనలో నేతన్నలు పడ్డారు.

12000 మందికి పోస్టల్ బ్యాలెట్

పుట్టపర్తి, ఏప్రిల్ 12: ఎన్నికల విధులకు కేటాయించిన 12వేల మంది ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. ఆ మేరకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు.. ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ఇవ్వడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మే 4, 5 తేదీలలో రెండవ విడత శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. దివ్యాంగులు, 85 సంవత్సరాలు పైబడినవారు ఇంటి వద్ద నుంచి ఓటు హక్కు వినియోగించుకునే దిశగా ఈనెల 21 నుంచి 23 వరకు బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు.

తొలివిడత ర్యాండమైజేషన్ పూర్తి

ఈవీఎంల ర్యాండమైజేషన్ తొలి విడత పూర్తి చేసినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ... ఆరు అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన సెంట్రల్‌యూనిట్స్ బ్యాలెట్ యూనిట్స్, వీవీ ప్యాట్ ఎస్ఐసీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో పరిశీలించామన్నారు. వీవీప్యాట్లు గురించి కలెక్టర్ వివరించారు. ఆయా కార్యక్రమాల్లో జేసీ అభిషేక్‌కుమార్, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, డీఆర్వో కొండయ్య, ఆర్డీఓలు వెంకటశివరామిరెడ్డి, కలెక్టరేట్ ఎన్నికల విభాగాధికారి మొహిద్దీన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు



ప్రాంతం	పుట్టపర్తి		కదిరి		ధర్మవరం		హిందూపురం		పెనుకొండ	
గరిష్ఠం కనిష్ఠం	38.0	24.0	37.0	23.0	38.0	24.0	37.0	23.0	36.0	23.0

బాలికలదే పైచేయి

ఇంటర్ ఫలితాల్లో ముందంజ



కొత్తచెరువు, ఏప్రిల్ 12: ఇంటర్ ప్రథమ,ద్వితీయ సంవత్సర ఫలితాల్లో జిల్లాలో బాలికలదే పైచేయి అయింది. ప్రథమ సంవత్సరం బాలురు 4629 మంది పరీక్షలు రాయగా.. 2442 మంది పాసై, 53 శాతం నమోదు చేశారు. బాలికలు 5,249 మంది పరీక్షలు రాయగా.. 3327 మంది పాసై 63 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో బాలురు 3,261 మంది పరీక్షలు రాయగా.. 2,303 మంది ఉత్తీర్ణులై 71శాతం సాధించారు. బాలికలు 4186 మంది పరీక్షలు రాయగా.. 3350 మంది పాసై 80శాతం ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరం ఒకేషనల్‌లో బాలురు 580 మందికిగాను 226 మంది పాసై 39శాతం, బాలికలు 677 మదికిగాను 448 మంది పాసై 66శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఒకేషనల్‌లో బాలురు 351 మందికిగాను 202 మంది పాసై 58 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 502 మందికిగాను 420 మంది పాసై, 84 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో మొత్తంగా ప్రథమ సంవత్సరంలో 9878 మంది పరీక్షలు రాయగా 5,769 మంది పాసై 58.4 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 20వ స్థానంలో నిలిచారు. ద్వితీయ సంవత్సరంలో 7,447 మంది పరీక్షలు రాయగా.. 5,653 మంది పాసై 75.91 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 13వ స్థానంలో నిలిచారు. గత సంవత్సరం కంటే ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో 10 శాతం ఉత్తీర్ణత పెరిగింది.

ప్రకృతి వ్యవసాయం.. లాభదాయకం

కేంద్ర బృందం సభ్యుడు


రాగి పంటను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 12: ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటల సాగు లాభదాయకమని కేంద్ర బృందం సభ్యుడు, రూరల్ డెవలప్‌మెంట్ కార్యాలయ ఆర్డీ శైలేంద్రకుమార్ సింగ్ పేర్కొన్నారు. పరిగి మండలంలోని గొరవనహళ్ళిలో శుక్రవారం వారు పర్యటించారు. అక్కడ రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండిస్తున్న పంటలు, వాటి దిగుబడి, లాభాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఘనామృతం, జీవామృతం, బెల్లం, శనగపిండి మిశ్రమం తయారీపై ఆరాతీశారు. వీటిపై దేశవిదేశాల ప్రతినిధులతో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరిస్తామని వ్యవసాయ శాఖాధికారులు తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ పంట దిగుబడి రావడమే కాకుండా ఆరోగ్యకరమైన పంటలు అందుతాయన్నారు. భూమి పైపొరల వద్దకు వానపాములు వస్తాయనీ, దీంతో భూమి సారవంతమౌతుందన్నారు. గొరవనహళ్లిలో రైతులు పండించిన రాగి, మొక్కజొన్న, జొన్న తదితర పంటలను పరిశీలించారు. వారు అనుసరిస్తున్న పద్ధతులు లాభదాయకంగా ఉన్నాయా, లేదా తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి విజయ్‌కుమార్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ఏం జరుగుతోంది?

కదిరి వైసీపీలో కొత్త రాజకీయం

అభ్యర్థి ఉండగానే
ఎన్నికల ఇన్‌చార్జి నియామకం
రాష్ట్రంలోనే తొలిసారి
శ్రేణుల్లో అయోమయం
నాయకుల్లో ఆందోళన


పూల శ్రీనివాసరెడ్డి


మగ్బూల్ అహమ్మద్



కదిరి, ఏప్రిల్ 12: నియోజకవర్గంలో అధికార పార్టీలో కొత్త రాజకీయానికి తెరలేచింది. అసెంబ్లీ అభ్యర్థి మగ్బూల్ అహమ్మద్ ఉండగానే.. ఎన్నికల ఇన్‌చార్జిగా ఆ పార్టీ నేత పూల శ్రీనివాసరెడ్డిని వైసీపీ అధిష్ఠానం గురువారం. నియమించింది రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఇలా నియామకం చేపట్టడం కదిరి వైసీపీలో కలకలం రేపింది. అసలు ఏం జరుగుతోందన్న చర్చకు తెరలేపింది. ఆ పార్టీ నేతల్లో ఆందోళన, శ్రేణుల్లో అయోమయం నెలకొంది. కదిరికి మాత్రమే ఎన్నికల ఇన్‌చార్జిని నియమించడం దేనికి సంకేతమని ఆపార్టీ కార్యకర్తలే చర్చించుకుంటున్నారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లోలేని ఎన్నికల ఇన్‌చార్జి కదిరి నియోజకవర్గానికే ఎందుకన్న చర్చలు మొదలయ్యాయి.

దేనికి సంకేతం?

రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా అభ్యర్థి ఉండగానే ఎన్నికల ఇన్‌చార్జి నియామకం దేనికి సంకేతమని ప్రజలు చర్చించుకుంటున్నారు. రాష్ట్రంలో అభ్యర్థుల మార్పుల నేపథ్యంలో ఇక్కడ కూడా అలాంటి నిర్ణయం తీసుకుంటుందా అన్న చర్చ సాగుతోంది. రానున్న ఐదారు రోజుల్లో ఎలాంటి మార్పులైనా జరగవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కదిరి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జిని నియమించడంతో నాయకుల్లో ఆందోళన నెలకొన్నట్లు సమాచారం. అభ్యర్థే ఎన్నికల ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ శ్రేణులను సమన్వయం చేసుకోవడం పరిపాటి. అలాకాకుండా అభ్యర్థి ఉండగానే మరో నాయకుడిని ఎన్నికల ఇన్‌చార్జిగా నియమించడం గమనార్హం. పూల శ్రీనివాసరెడ్డి కదిరి నియోజకవర్గ వాసి అయినా.. సీఎం సొంత జిల్లా కడపతో ఎక్కువ సంబంధాలు కలిగి ఉన్నారు. అలాంటి ఆయనను ఎన్నికల ఇన్‌చార్జిగా నియమించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ నియామకంపై కొంతమంది నేతలు గుర్రుగా ఉన్నట్లు తెలుస్తోంది.

రోడ్డు వేసేవరకు పోరాటం
ఆగదు

గుర్రపుకొండ తండావాసుల ఉద్ఘాటన
రెండోరోజూ రహదారిపై బైఠాయింపు


రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న తండావాసులు

మడకశిర రూరల్, ఏప్రిల్ 12: మండలంలోని గుర్రపుకొండ తండాకు రోడ్డు సౌకర్యాం కల్పించే వరకు పోరాటం అగదని తండావాసులు ఉద్ఘాటించారు. మండలంలోని కదిరేపల్లి క్రాస్ వద్ద మడకశిర-అమరాపురం ప్రధాన రహదారిపై శుక్రవారం ఉదయం బైఠాయించి, నిరసన వ్యక్తంచేశారు. రెండు గంటలపాటు వాహన రాకపోకలు నిలిచిపోయాయి దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు ధర్నా చేస్తున్న తండావాసుల వద్దకెళ్లి, చర్చించారు. రైతులు, తండావాసులను కార్యాలయానికి పిలిపించి, మాట్లాడారు. రికార్డులను పరిశీలించి, సబ్ కలెక్టర్‌కు పంపుతామని ఆయన తెలిపారు. దీంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

సేవలు లో... అవినీతి హై




- విద్యుత్‌శాఖ కార్యాలయంలో యథేచ్ఛగా అక్రమాలు
- ప్రతి పనికీ రేటు కట్టి మరీ ఉద్యోగుల దోపిడీ
- వాటాలు తీసుకొని.. సహకరిస్తున్న ఉన్నతాధికారులు
- ట్రాన్స్‌ఫార్మర్లు.. ఇతర సామగ్రి విక్రయాలు
- 'నార్పల' అక్రమాలపై నేటికీ చర్యలు శూన్యం



విద్యుత్ శాఖ కార్యాలయం

అనంతపురం రూరల్, ఏప్రిల్ 12: విద్యుత్‌శాఖలో ఉద్యోగులు సేవలను నిర్లక్ష్యం చేస్తూ... విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారు. సంస్థ వస్తువులను ఉద్యోగులు అక్రమంగా అమ్ముకొంటున్నారు. వారిపై చర్యలు తీసుకోవడం అటుంచి... కనీసం అడిగే నాథుడే కరువయ్యాడు. శాఖలోని ఉద్యోగులు ప్రతి ఒక్కదానికి రేటుకట్టి మరీ దండుకుంటున్నారు. ఈ దోపిడీలో కొంత ఉన్నత స్థాయి అధికారులకూ వాటాలు వెళ్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈక్రమంలో అక్రమార్కుల తప్పులను కప్పిపుచ్చుతూ.. వారి అండగా నిలుస్తున్నారు. దీంతో ఉద్యోగులు మరింత అక్రమాల్లో పేట్రేగిపోతున్నారు. నార్పల మండలంలో చేటు చేసుకున్న అక్రమాలే ఇందుకు ఇందుకు నిలువెత్తు ఉదాహరణ. దాదాపు అరకోటి రుపాయల అక్రమాలు జరిగినట్లు తెలిసినా ఉన్నతాధికరులు ఇంకా మొద్దునిద్రలోనే జోగుతున్నారు. ఇలా ఈ మండలం ఒక్కటే కాదూ.. ప్రతి మండలంలోనూ ఇలా అవినీతి జరిగింది. ఇవన్నీ ఉన్నతాధికారులకు తెలిసినా... వారిపై చర్యలు తీసుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.



అధికారుల అండతోనే అవినీతి..

శాఖలో ఎన్ని అక్రమాలు జరిగినా.. వారిని కొంతమంది ఉన్నతాధికారులు వెనుకేసుకొస్తున్నట్లు ఆరోపణలున్నాయి. క్షేత్రస్థాయిలో దండుకునే సొమ్ములో నుంచి కొంత వాటా ఆయా అధికారులకు వెళ్తుండటమే కారణం. నార్పల మండలంలో ట్రాన్స్‌ఫార్మర్ అక్రమ అమ్మకాలే ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. అంతేకాకుండా మండలంలోని ఓ అధికారి ప్రైవేట్ వ్యక్తి ద్వారా ఇష్టారాజ్యంగా ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతరాత్ర సామగ్రి అమ్ముకున్నట్లు సమాచారం. ఈక్రమంలో సదరు అధికారిని మూడు నెలల కిందట రిలీవ్ చేసినట్లు విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఆ ఉద్యోగి ఇప్పటికీ ప్రైవేట్ వ్యక్తితో కలసి కార్యాలయానికి వచ్చి.. స్థానికంగా పనులన్నీ చక్కబెడుతుండటం కొసమెరుపు. ఇలా అక్రమార్కులను వెనకేసుకురావడంతో విద్యుత్‌శాఖ అధికారులకు కొత్తేమీకాదు. గతంలోనూ ఇలాంటి ఘటనలు చాలానే జరిగాయి. ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు రైతుల నుంచి లైన్‌మెన్లు డబ్బులు వసూలు చేస్తుండటం.. ఈ విషయాలపై కార్యాలయాల్లో గొడవలు జరగడం.. అయినా అవినీతి అధికారులపై చర్యలు తీసుకోకపోవడం.. ఇక్కడ పరిపాటే.

దండుకోవడమే లక్ష్యం..

విద్యుత్ శాఖలోని కొంత మంది అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది దండుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇంటికీ విద్యుత్ కనెక్షన్ మొదలుకొని.. వ్యవసాయ కనెక్షన్లు, మీటర్ల ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మత్తులు, విద్యుత్ లైన్ల మార్పు ప్రతి పనికి పైసలు ఇస్తేనే పనులు జరుగుతాయ్... వ్యవసాయ కనెక్షన్లు మంజూరులో అయితే రైతుల నుంచి వేలకు వేలు దండుకొంటున్నారు. ఒక ట్రాన్స్‌ఫార్మర్ మంజూరై.. రైతుకు చేరాలంటే రూ.30వేల నుంచి రూ.50వేల వరకు ఇచ్చుకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. అవీ అన్నీ సక్రమంగా ఇస్తారంటే అది లేదు. ట్రాన్స్‌ఫార్మర్ ఇస్తే.. విద్యుత్ స్తంభాలు ఇవ్వరూ. ఆ రెండు ఇస్తే.. కండెనర్, ఇతరాత్ర సామగ్రి ఇవ్వని పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా అపార్ట్‌మెంట్లకు కనెక్షన్లు ఇవ్వాలంటే ఎవ్వరికీ ఎంత ఇచ్చినా ఓ అధికారికి మాత్రం రూ.10 వేలు ఇవాల్సిందే అంటున్నారు. లేదంటే ఫైల్ ముందుకు కదలదు. సంస్థలోని ఓ ఉన్నతాధికారికి ప్రతినెలా ఒక్కొక్క డివిజన్ నుంచి రూ.50 వేలు వెళ్లాల్సిందే. ఇదేమీని ప్రశ్నిస్తే... తనకేమీ ఈ పోస్టు ఊరికే రాలేదు.. కోట్లు గుమ్మరించి చెచ్చుకున్నాం అంటున్నాడు. జిల్లాలోని ఓ ఉన్నతాధికారి కూడా తన పోస్టు కోసం రూ.30 లక్షల పెట్టి మరి తెచ్చుకున్నట్లు సమాచారం.



మీటర్ల ఏర్పాటుపై రైతుల ఆగ్రహం



నిరసన తెలుపుతున్న రైతులు

ఉరవకొండ, ఏప్రిల్ 12: వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేయడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వజ్రకరూరు మండలంలోని చాయాపురం గ్రామంలో శుక్రవారం వ్యవసాయ మోటార్లకు మీటర్లను ఏర్పాటు చేస్తున్న సిబ్బందిపై పొలాల్లోనే రైతులు తిరగబడ్డారు. తమ అనుమతులు లేకుండా, కనీసం ముందస్తు సమాచారం ఇవ్వకుండా మీటర్లను ఎలా బిగిస్తారంటూ సిబ్బందిని నిలదీశారు. అప్పటికే బిగించిన మోటార్లను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నిబంధనల పేరుతో రైతులను ఇబ్బంది పెడితే ఓటుతో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పి, మీటర్లు ఎందుకు బిగిస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు తమ్మినేని నాగభూషణం, సర్పంచ్ మనోహర్ మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లకు మీటర్లను ఏర్పాటు దుర్మార్గమైన చర్య అన్నారు. మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు.

మీటర్లను ధ్వంసం చేస్తాం: ఏపీ రైతు సంఘం

వ్యవసాయ మోటార్లకు మీటర్లను బిగిస్తే వాటిని ధ్వంసం చేస్తామని ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి మనోహర్ హెచ్చరించారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లను బిగించడం ప్రభుత్వ అనాలోచిత నిర్ణయమన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మధుసూదన్ మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లకు మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వల్ల రైతులు నట్టేట మునిగారన్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక మిర్చి రైతులు పొలాల్లోనే రాశులు పోసుకుని అమ్ముకునేందుకు ఎదురు చూస్తున్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మీటర్ల ఏర్పాటుతో వేధించడం తగదన్నారు.

అడ్డుకుంటున్న రైతులు



మద్య నిషేధంపై మాట తప్పిన సీఎం

- జగన్‌పై మాజీ మంత్రి పరిటాల సునీత ఆగ్రహం
- మద్యంలో రూ.లక్ష కోట్లు దోపిడీ చేశాడని ఆరోపణ

అనంతపురం ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): దశలవారిగా మద్యపాన నిషేధం చేస్తానంటివి.. ఐదేళ్ల కాలంలో ఆ ఊసే ఎత్తలేదు..ఇప్పుడు ఓట్లు ఎలా అడుగుతున్నావ్..అని మాజీ మంత్రి, రాప్తాడు కూటమి అభ్యర్థి పరిటాల సునీత సీఎం జగన్‌ను ప్రశ్నించారు. శుక్రవారం అనంతపురంలోని తన నివాసంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ... సీఎం జగన్ మద్యాన్ని ఆదాయ వనరుగా మార్చుకొని రూ. లక్ష కోట్లు దోపిడీ చేశాడని ఆరోపించారు. మద్యపాన నిషేధం పేరుతో మహిళలను మోసం చేశారని ఆగ్రహించారు. అధికారంలోకి వచ్చాక ప్రభుత్వమే మద్యం అమ్మకాలు చేపట్టడం దారుణమన్నారు. 2021లో నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వేలో రాష్ట్రంలో దాదాపు 31.4 శాతం మంది మద్యం సేవిస్తున్నారని తేలిందన్నారు. ఐదేళ్లల్లో మద్యం తాగేవారి సంఖ్య మరింత పెరిగిందేగానీ తగ్గలేదన్నారు. మద్యం మాఫియా ద్వారా జే గ్యాంగ్ రూ.లక్ష కోట్లను అప్పనంగా దోచేసిందని ఆమె ఆరోపించారు. మద్యం బ్లాక్ మార్కెట్ అమ్మకాల డబ్బంతా తాడేపల్లి ప్యాలెస్‌కు తరలిపోయిందని విమర్శించారు. మద్యం అమ్మకాల మీద వచ్చే ఆదాయాన్ని సీఎం జగన్ మరో 20 ఏళ్లకు తాకట్టుపెట్టడం సిగ్గుచేటన్నారు. జగన్‌రెడ్డి జే బ్రాండ్ కారణంగా జంగారెడ్డి గూడెంలో 25 మంది చనిపోయారన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది అనారోగ్యం పాలయ్యారన్నారు. వీటన్నింటికీ జగన్ సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడం తథ్యమన్నారు. జగన్‌రెడ్డి మద్యం లెక్కలన్నీ తేలుస్తామని ఆమె స్పష్టం చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న పరిటాల సునీత

బీఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 12: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఫార్మసీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు శుక్రవారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ కేశవరెడ్డి, సీఈ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి, మార్చిలో బీఫార్మసీ ప్రథమ సంవత్సరం ఒకటవ సెమిస్టర్(ఆర్19) రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. అదే విధంగా ద్వితీయ సంవత్సరం ప్రథమ సెమిస్టర్(ఆర్15), ద్వితీయ సెమిస్టర్(ఆర్19,15) సప్లమెంటరీ పరీక్షలు జరిగాయన్నారు. ఫార్మా-డీ ఐదవ సంవత్సరం(ఆర్17) రెగ్యులర్, సప్లమెంటరీతోపాటు ఫార్మా-డీ(పీ.బీ) తృతీయ సంవత్సరం(ఆర్17) రెగ్యులర్ పరీక్షలు నిర్వహించామన్నారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

మద్యంతో మహిళల తాళిబొట్లు తెంచాడు

- సీఎం జగన్‌పై టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు బీవీ మండిపాటు

అనంతపురం/పుట్టపర్తి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్య నిషేధ హామీ అమలు చేయకపోగా నకిలీ మద్యంతో ఎందరో మహిళల తాళిబొట్లు తెంచిన వ్యక్తి సీఎం జగన్ అని సత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు మండిపడ్డారు. మద్యపాన నిషేధం హామీపై వైసీపీని నిలదీయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం అనంతపురంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... సీఎం జగన్‌రెడ్డి మద్యపాన నిషేధం ముసుగులో రూ.లక్ష కోట్లు లూటీ చేశాడని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో జే బ్రాండ్ల మద్యాన్ని సరఫరా చేసి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడిన వ్యక్తి జగన్‌రెడ్డి అని మండిపడ్డారు. నిషేధం పేరుతో అధికారంలోకి వచ్చి, మద్యాన్నే ఆదాయంగా మార్చుకున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. మద్యపాన నిషేధ అమలు కోసం జగన్‌రెడ్డి రాష్ట్రంలో ఎక్కడైనా డీ అడిక్షన్ సెంటర్‌ను ప్రారంభించారా..? అని సూటిగా ప్రశ్నించారు. మద్యపానాన్ని ఆదాయ వనరుగా మార్చుకొని, అవినీతి ద్వారా రూ. కోట్లు కొల్లగొట్టేందుకే మద్యం దుకాణాల్లో డిజిటల్ పేమెంట్లను నిషేధించారన్నారు. జగన్‌రెడ్డి సోదరుడు వైఎస్ అనిల్‌రెడ్డి అక్రమ మద్యం వ్యాపారంలో ఆరితేరిపోయారన్నారు. ఏపీబేవరైజెస్ కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి కనుసన్నల్లోనే మద్యం మాఫియా అరాచకాలు పేట్రేగిపోతున్నాయన్నారు. ఎన్నికల నేపథ్యంలో వైసీపీ అభ్యర్థులకు అక్రమంగా మద్యం సరఫరాకు వాసుదేవరెడ్డి ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. తక్షణమే విధుల నుంచి తొలగించాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో కూటమిదే అధికారమని ధీమా వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న బీవీ వెంకటరాముడు

కానిస్టేబుల్‌పై వేటు..?

- మద్యం తరలిస్తూ వైసీపీ నాయకుడితో పట్టుబడిన వైనం

చిలమత్తూరు, ఏప్రిల్ 12: మద్యం తరలిస్తున్న ఓ కానిస్టేబుల్‌పై వేటు పడింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. శెట్టిపల్లి పంచాయతీ పరిధిలో ఎస్.ఐ హూసేన్‌పురానికి వెళ్లి తిరిగి వస్తుండగా అర్ధరాత్రి సమయంలో వీరాపురం వైపు నుంచి కారు ఎదురుగా వచ్చింది. పోలీస్ సైరన్ మోగించడంతో ఆ కారులో ఉన్న వ్యక్తులు తప్పించుకోవడానికి ప్రయత్నించారు. వారిలో కానిస్టేబుల్ కూడా ఉన్నట్లు ఎస్ఐ గుర్తించారు. ఆ కారు వెంట అనుసరిస్తున్న మరో ద్విచక్రవాహనం అదీ కానిస్టేబుల్‌ది కావడం, ద్విచక్రవాహనంలో మండల ప్రజాప్రతినిధి బంధువు ఉన్నాడు. ఇతను పలు దఫాలుగా మద్యం కేసుల్లో పట్టుబడినట్లు తెలిసింది. ఆ కారులో ఉన్నది మద్యమేనని ఎస్ఐ గుర్తించారు. ఆ కానిస్టేబుల్ విధులకు హాజరుకాకపోవడంతో అనుమానం వచ్చి విచారించారు. అసలు విషయం బయట పడినట్లు తెలిసింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో విషయం బయటికి పొక్కకుండా వీఆర్‌కి పంపారు. దీనిపై పోలీసు అధికారిని వివరణ కోరగా జరిగిన విషయం విధితమే కానీ, ఎన్నికల కోడ్ కారణంగా ఉన్నతాధికారులు విషయాన్ని తెలియజేస్తామన్నారు.

రూ.3.65లక్షల నగదు సీజ్

అనంతపురం క్రైం, ఏప్రిల్12 : ఎలాంటి ఆధారాలు లేకుండా అక్రమంగా తీసుకెళ్తున్న రూ.3.65లక్షల నగదును వేర్వేరుగా టూటౌన్, ఫోర్త్‌టౌన్ పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. శుక్రవారం జిల్లా ఎస్పీ అమిత్‌బర్దర్ ఆదేశాల మేరకు డీఎస్పీ వీరరాఘవరెడ్డి పర్యవేక్షణలో టూటౌన్ సీఐ క్రాంతికుమార్, ఎస్ఐ రుష్యేంద్రబాబు, పోలీస్ సిబ్బంది స్థానిక రైల్వే గేటు సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. అనంతపురంలోని మారుతీనగర్‌కు చెందిన పి.రామాంజనేయులు ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.2.65లక్షల నగదు తీసుకెళ్తుండగా పట్టుబడ్డాడు. పోలీసులతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్ టీం సిబ్బంది ఆ నగదును ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించారు. ఫోర్త్‌టౌన్ సీఐ ప్రతాప్‌రెడ్డి, ఎస్ఐ నాగమధులు రుద్రంపేట సర్వీస్ రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ధర్మవరం పట్టణం రాజేంద్రనగర్‌కు చెందిన గుర్రం శివకుమార్ ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.లక్ష నగదు తీసుకెళ్తుండగా పట్టుబడ్డాడు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌తో కలిసి ఆ డబ్బు సీజ్ చేసి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించారు.

ధర్మవరంలో రూ.2.57 లక్షలు...

ధర్మవరం : ఎటువంటి బిల్లులు లేకుండా నగదును తీసుకెళ్తున్న వ్యక్తి నుంచి రూ.2.57లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ధర్మవరం వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం తెలిపారు. శుక్రవారం స్థానిక ఎర్రగుంట్ల సర్కిల్‌లో తనతోపాటు ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో బెంగుళూర్ రూరల్ హోసకోట్ మండలం హసగల గ్రామానికి చెందిన కృష్ణప మోహన్‌కుమార్ ఎటువంటి బిల్లులు లేకుండా వాహనంలో నగదును తీసుకుకెళ్తుండటంతో ఆ నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

వికటించిన అన్నప్రసాదం

- వందమందికి పైగా ఆస్పత్రిపాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు



ఆందోళన చెందుతున్న కుర్లపల్లివాసులు

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 12: కనగానపల్లి మండలం కుర్లపల్లి గ్రామంలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో అపశ్రుతి చోటుచేసుకుంది. అన్నదానం అనంతరం శుక్రవారం వందమందికి పైగా భక్తులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుర్లపల్లిలో నూతన ఆలయం నిర్మించి, సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామస్థులతో పాటు వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం అన్నదానం నిర్వహించారు. పాయసం, పులిహోర తదితర పదార్థాలను వడ్డించారు. వీటిని తిన్నవారు సాయంత్రం 6.30 గంటల నుంచి వాంతులు, విరేచనాలతో ఇబ్బందిపడ్డారు. గంట వ్యవధిలో వందమందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన గ్రామస్థులు బాధితులను 108తో పాటు వివిధ వాహనాల్లో ధర్మవరం ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. పలువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తన సిబ్బందితో గ్రామాన్ని సందర్శించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులను పిలిపించి ఆహార పదార్థాల నమూనాలను సేకరించారు. పాయసంలో రుచికోసం కలిపిన నూనెలాంటి పదార్థం కారణంగా ఇలా జరిగి ఉంటుందని గ్రామస్థులు భావిస్తున్నారు. శుభకార్యం నిర్వహించిన గ్రామస్థులు.. తమ బంధు మిత్రులు, కుటుంబ సభ్యులు అస్వస్థతకు గురి కావడంతో ఆందోళనకు లోనయ్యారు. బాధితులను ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రిలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు.



సెలైన్‌బాటిళ్లతో..



ఆస్పత్రిలో చిన్నారికి సెలైన్



బాధితులను పరామర్శిస్తున్న పరిటాల శ్రీరామ్



టీడీపీలో చేరిన నాయకులతో మాజీ మంత్రి పల్లె

ఎంపీపీ స్వగ్రామంలో వైసీపీకి షాక్

- టీడీపీలో చేరిన వలంటీర్లు, వైసీపీ నాయకులు

బుక్కపట్నం, ఏప్రిల్ 12: ఎంపీపీ స్వగ్రామంలో వైసీపీకి షాక్ తగిలింది. రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్లు ఉద్యోగాలకు రాజీనామాచేసి వైసీపీ అభ్యర్థుల వెంట ప్రచారంలో పాల్గొంటున్నారు. ఎంపీపీ స్వగ్రామమైన మండలంలోని గసికవారిపల్లిలో వలంటీర్లు రవి, రమణ ఉద్యోగాలకు రాజీనామా చేసి, శుక్రవారం మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారితోపాటు మరో పది కుటుంబాలు వైసీపీనుంచి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. వలంటీర్లకు రూ.10వేల వేతనం ప్రకటించడం హర్షణీయమన్నారు. పల్లె రఘునాథ రెడ్డి విజయానికి కృషి చేస్తామన్నారు.

చీనీకాయలు టన్ను రూ.41 వేలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 12: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.41వేలు, కనిష్ఠంగా రూ.20వేలు, సరాసరి రూ.30 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 768 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

పరీక్షలు తప్పామని..

ముగ్గురి ఆత్మహత్యాయత్నం.. ఒకరి మృతి

గుంతకల్లు టౌన్/చెన్నేకొత్తపల్లి/ధర్మవరం రూరల్, ఏప్రిల్ 12: ఇంటర్ పరీక్షలో ఫెయిలైనందుకు మనస్తాపంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో ముగ్గురు విద్యార్థినులు ఆత్మహత్యకు యత్నించారు. వీరిలో గుంతకల్లు పట్టణానికి చెందిన ఎస్ నందిని(18) మృతిచెందారు. మిల్లు కాలనీకి చెందిన రాఘవేంద్ర కూతురు నందిని.. స్థానిక నారాయణ కళాశాలలో ఇంటర్ చదివింది. ద్వితీయ సంవత్సరం మూడు సబ్జెక్టులు ఫెయిల్ అయ్యింది. దీంతో మనస్తాపం చెంది, ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు.

- శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి గ్రామానికి చెందిన చైతన్య ఇంటర్ ఫెయిలైనందుకు మనస్తాపంతో విష రసాయనం తాగింది. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ధర్మవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. చైతన్య ధర్మవరం పట్టణంలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ చదివింది. ధర్మవరం మండలం నిమ్మలకుంట గ్రామానికి చెందిన మానస ద్వితీయ సంవత్సరం ఒక సబ్జెక్టులో ఫెయిలైంది. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో విష రసాయనం తాగింది. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స కొనసాగుతోంది. మానస ధర్మవరం పట్టణంలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ చదివింది.



నందిని మృతదేహం

వైసీపీ ప్రచారంలో ఎంఎల్‌ఓ

రాయదుర్గం, ఏప్రిల్ 12: ప్రభుత్వ జీతం తీసుకుంటూ ఎంఎల్‌ఓలు వైసీపీ ప్రచార సేవలో మునిగి తేలుతున్నారు. కణేకల్లు మండల ఎంఎల్ఓ సుంకేష్ శుక్రవారం బొమ్మనహాళ్ మండలంలో జరిగిన వైసీపీ ప్రచారంలో పాల్గొన్నారు. వైసీపీ ప్రచార రథం ఎక్కి వారి ఫొటోలు, వీడియోలు తీస్తూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నాడు. ఉద్దేహాళ్ నుంచి ఉంతకల్లు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సుంకేష్ పాల్గొన్నారు. అయితే అధికారులు సుంకేష్‌పై చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.



ప్రచార రథంపై సుంకేష్

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల ప్రతిభ



అనూష (977) ద్వితీయ ఎంపీసీ | చంద్రికరాణి (967) ద్వితీయ ఎంపీసీ | అక్షయ (963) ద్వితీయ ఎంపీసీ | నజీన్ (974) ద్వితీయ బైపీసీ | పవన్‌కుమార్ (954) ద్వితీయ బైపీసీ | లక్ష్మీకుమార్ (942) ద్వితీయ ఎంపీసీ

ధర్మవరం, ఏప్రిల్ 12: ఇంటర్ పరీక్షల ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఇందులో ధర్మవరంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ఆయా ప్రిన్సిపాళ్లు ప్రశాంతి, లక్ష్మీకాంత్ తెలిపారు. బాలికల కళాశాలలో ప్రథమ సంవత్సరానికి సంబంధించి 189 విద్యార్థులకు గాను 136మంది ఉత్తీర్ణులు అయ్యారని, ద్వితీయ సంవత్సరంలో 117 మంది విద్యార్థులకు గాను 95 మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్ చెప్పారు. బాలికల కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూపునకు చెందిన అనూష 977 మార్కులు సాధించిందన్నారు. అలాగే చంద్రిక రాణి(967), అక్షయ(963)మార్కులు సాధించగా.. బైపీసీలో నజీన్(974), మేఘవర్షిణి(964), ఆషా(961) మార్కులు సాధించినట్లు తెలిపారు. ప్రథమ సంవత్సరం సీఈసీకి చెందిన జీవన్ 467 మార్కులు సాధించారన్నారు. బాలుర జూనియర్ కళాశాలకు చెందిన సీనియర్ బైపీసీకి చెందిన పవన్‌కుమార్ (954), సీనియర్ ఎంపీసీకి చెందిన లక్ష్మీకుమార్ (947) మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ప్రశాంతి తెలిపారు.

ప్రతిభ చూపిన ప్రైవేటు కళాశాలలు



హమీద(987) | మాధురి(987) | కల్యాణి(986) | దుర్నాజ్(980) | మాబ్జాన్(968) | వర్షిత(466)



గౌతమి(465) | మహబూబ(465) | దివ్య(429) | మంజరి(470) | వేమంత్(463) | అయేషా(459)



రవి(472) | హేమంత్(462) | వికాస్(984) | వర్షాంజలి(981) | అఫ్రోజ్(979)

ధర్మవరం, ఏప్రిల్ 12: ఇంటర్ ఫలితాల్లో ధర్మవరం పట్టణంలోని ప్రైవేటుకళాశాలల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఇందులో వాసవీ జూనియర్ కళాశాలలో సీనియర్ ఎంపీసీ గ్రూపునకు చెందిన హమీద(987), మాధురి(987), కళ్యాణి(986), సుప్రియ(985), శ్రీహర్షిత(985), భావన (985), శర్వాణి(985), యశశ్రీ(985), శ్రీలేఖ(985), నిఖిత(984), ప్రణతి(984), అంజలి(984), ఎస్ఆర్‌కే ఉజ్మా సిద్దిక(982), మౌనిక(982), ప్రజ్ఞ(981), అనూష(980), ప్రతిభ(980) సాధించారని, బైపీసీలో దుర్నాజ్(980), యశస్విని(977), సారసాధియ(976) మార్కులు సాధించారని కళాశాల డైరెక్టర్లు పేర్కొన్నారు. సీఈసీలో మాబ్‌జాన్(968), ప్రసన్నకుమారి (961), జ్యోతిక(958) సాధించినట్లు పేర్కొన్నారు. ఇక జూనియర్ ఎంపీసీలో వర్షిత (466), గౌతమి(465), మహబూద(465), హప్స(462), కీర్తన(462) సిరి(462), యామిని(461), సాయిసుహాసిని(461), గ్రీష్మ (460), శ్రావణి(460), అర్చన(459), జాహ్నవి(459), శ్రీవిద్య(459), సుప్రియ(459), సౌమ్య (458), తస్లిమానస్రీన్(457), అఖిల(457), ప్రణతి(457), సాయిదీపిక(457), హరిప్రియ(456), సానియా(456), స్వాతి(455), మౌనిక(454), హారిక(454), హర్షిత(452), శ్రావణి(452), నవ్య(451), భవిష్యరెడ్డి(451), గురుమహేశ్వరి(451), బైపీసీలో దివ్య(429), శాంతియ(426), ఎంఈసీలో మంజరి(470), సీఈసీలో స్వాతి(461) మార్కులు సాధించినట్లు డైరెక్టర్లు తెలిపారు.

సాయికృప కళాశాలవిద్యార్థుల ప్రతిభ..

ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో శ్రీసాయికృప జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించినట్లు కరెస్పాండెంట్ క్రిష్ణతేజ, డైరెక్టర్లు తెలిపారు. వేమంత్(463),హేమంత్(462), అయేషా(459), యశ్వంత్(458), నితిన్‌సాయికుమార్ రెడ్డి(458), శ్వేత(457), మంజునాథ్(456), వినోద్(456), సర్ఫరాజ్(451), లక్ష్మి(450), సీఈసీలో రవి(472), వెన్నెల (468) సాధించారని తెలిపారు. ద్వితీయసంవత్సరం ఎంపీసీలో వికాస్ (984), వర్షాంజలి(981), అఫ్రాస్‌వలి(979), అరుణకుమారి(976), క్రిషకౌశిక్(974), పుష్ప(972), లావశ్రీ(972), లిఖిత(971), తేజేశ్వర్(970), శిరీష(966), అభిరామ్(964), సీఈసీలో సంతోష్(950) మార్కులు సాధించారన్నారు.

సీతారామయ్య జూనియర్ కళాశాల..



కావ్యశ్రీ ఎంపీసీ(454) | కీర్తన ఎంపీసీ(452 | మాధవి సీఈసీ(481) | స్మృతితనయ సీఈసీ(472) | లక్ష్మీ ఎంపీసీ(943) | మౌనశ్రీ ఎంపీసీ(937)

ధర్మవరం, ఏప్రిల్ 12: పట్టణంలోని సీతారామయ్య బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూపినట్లు కరెస్పాండెంట్ సీతారామయ్య పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీలో కావ్యశ్రీ(454), కీర్తన(452), హైమావతి(450), గాయత్రి(443), హరిప్రియ(443), ఉదయశ్రీ(441), బైపీసీలో గౌసియా(394), నవ్యశ్రీ(355), సీఈసీలో మాధవి(481), శృతితనయ(472), నాగజ్యోతి(457), దివ్యలక్ష్మి(446), బ్రాహ్మణి(442) మార్కులు తెచ్చుకున్నట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో లక్ష్మి(943), మౌనశ్రీ(937), గౌతమి(936), బేబీ(915), జ్యోతిక(913), బైపీసీలో మౌనశ్రీ(957), షాజిమా (920), సీఈసీలో హాజీరభాను(922), కెఎం.లిఖిత(900) మార్కులు సాధించినట్లు కరెస్పాండెంట్ తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తాచాటిన బాలికలు



పవిత్ర ఫస్టియర్ ఎంపీపీ | జయరాంనాయక్ ఫస్టియర్ ఎంపీపీ | నందినిబాయి ఫస్టియర్ బైపీపీ | గాయత్రి సెకండియర్ (ఎంపీసీ) | పుష్పలత సెకండియర్ (ఎంపీసీ) | లక్ష్మీశరణ్య సెకండియర్ (సీఈసీ)

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 12: ఇంటర్ పరీక్షఫలితాల్లో జిల్లాకేంద్రంలోని జగరాజుపల్లి ఆదర్శపాఠశాల బాలికలు సత్తాచాటారు. ఫస్టియర్ విద్యార్థులు 59 మంది పరీక్షలు రాయగా 32 మంది ఉత్తీర్ణత సాధించారు. సెకెండియర్‌కు చెందిన 57 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 44 మంది ఉత్తీర్ణత సాధించారు. ఇందులో ఫస్టియర్ ఎంపీసీలో పవిత్ర 421 మార్కులు, ఎం జయరాంనాయక్ 417, బైసీపీలో నందినీబాయి 387, గిరీషిత 368, సీఈసీలో కోమలి 326 మార్కులు సాధించారు. సెకెండియర్ ఎంపీసీలో గాయత్రి 941, పుష్పలత 928, బైపీసీలో ఝాన్సీ 889, సీఈసీలో లక్ష్మీశరణ్య 928, శిరీష 908 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ రమేష్‌బాబు తెలిపారు.

మంగళకర కళాశాల విద్యార్థుల ప్రతిభ

జగరాజుపల్లిలోని మంగళకర కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూపారు. ప్రథమ సంవత్సరంలో 82శాతం, ద్వితీయ సంవత్సరంలో 87 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల కరెస్పాండెంట్ సురేష్‌కుమార్ తెలిపారు. ప్రథమసంవత్సరం ఎంపీసీలో తౌఫిక్ 448 మార్కులు, ధనుష్ 448, కార్తీక్‌రెడ్డి 444, బైపీసీలో శశికళ 410, రక్షిత 409 మార్కులు సాధించారన్నారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో విద్యశ్రీ 969, హర్షవర్ధన్ 959 , వెంకటేశ్వర్లు 957, బైపీసీలో పల్లవి 956, భవ్యశ్రీ 954, ఎంఈసీలో సంధ్య 846 మార్కులు, సాధించినట్లు ఆయన పేర్కొన్నారు.

తాడిమర్రి విద్యార్థుల ప్రతిభ

తాడిమర్రి, ఏప్రిల్ 12: మండల కేంద్రంలోని కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 25 మంది విద్యార్థినులు పరీక్ష రాయగా 22 మంది ఉత్తీర్ణత సాధించారు. ఫస్ట్ ఇయర్ వారు 25 మందికి గాను 22 మందిపాసైనట్టు కళాశాల విద్యాలయం ప్రిన్సిపాల్ తెలిపారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 31 మంది విద్యార్థులకు గాను 28 మంది సెకెండియర్ వారు పాసయ్యారు. ఇక మొదటి సంవత్సరం వారు 19 మందికి గాను 12 మంది పాసయ్యారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 12: సోమందేపల్లి గ్రామంలో తొగటవీర క్షత్రియ, దేవంగ కులస్తుల ఆధ్వర్యంలో చౌడేశ్వరీదేవి జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ప్ర త్యేక అలంకరణ, పూజ లు, హోమాలు నిర్వహించారు. ఉదయం పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు డీసీ ఈశ్వరయ్య, సతీమణి రత్నమ్మ ప్రత్యేకంగా చేయించిన వెండి కత్తిని అమ్మవారికి బహూకరించారు. డీసీ వెంకటేష్, డీసీ అశోక్ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో జరిగిన అమ్మవారి జ్యోతుల ఉత్సవాల్లో పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పాల్గొన్నారు. ఆమెకు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఈశ్వరయ్య, వెంకటేశులు శాలవతో సన్మానించారు.

జిల్లేడుబండ నిర్వాసిత రైతులకు

పరిహారం అందిస్తాం

- కూటమి అధికారంలోకి రాగానే హామీ నెరవేరుస్తాం
- ఆత్మీయ సమావేశంలో కూటమి ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధి



సమావేశంలో మాట్లాడుతున్న బీకే పార్థసారథి

ముదిగుబ్బ, ఏప్రిల్ 12: కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లేడు బండ ప్రాజెక్టు ముంపు రైతులకు పరిహారం అందిస్తామని హిందూపురం పార్లమెంట్ కూటమి టీడీపీ ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథి తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కూటమి పార్టీల ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లేడుబండ ప్రాజెక్టు ముంపు రైతుల సమస్య పరిష్కారంతో పాటు, ముదిగుబ్బలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. హంద్రీనీవా ద్వారా గొల్లపల్లి, మారాలా రిజర్వాయర్లను పూర్తి చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని పేర్కొన్నారు. కియా పరిశ్రమ తెచ్చి 50 వేల ఉద్యోగాలు అందించిన ఘనత కూడా చంద్రబాబుదేనన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులను గెలుపించాలని కోరారు. కూటమితోనే భావితరాలకు భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో పాలన పిచ్చోడి చేతిలో రాయిలాగా మారిందన్నారు. వైసీపీని ఇంటికి సాగనంపుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కదిరి మాజీ శాసన సభ్యుడు ఎమ్మెస్ పార్థసారథి, టిడిపి నాయకలు, బిజెపి నాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కందికుంట ముమ్మర ప్రచారం

- ఊరూరా ఘన స్వాగతం



కటారుపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కందికంట

గాండ్లపెంట, ఏప్రిల్ 12: మండలంలోని కటారుపల్లి, కమతంపల్లి పంచాయతీల్లో శుక్రవారం కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా చేపట్టారు. ఆయనకు గ్రామాల్లో ప్రజలు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టి స్వాగతించారు. కటారుపల్లి, గొల్లపల్లి ఎస్సీ కాలనీ, కటారుపల్లి క్రాస్, గజ్జలవారిపల్లి, ద్వారనాల, కమతంపల్లి, మద్దివారిగొంది, కోటపల్లి, దాసరవాండ్లపల్లి గ్రామాల్లో ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజల్ని అభ్యర్థించారు. కూటమి అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధి పనుల్ని వివరించారు. చంద్రబాబు సీఎం అయితేనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలిపారు. కటారుపల్లిలోని యోగివేమన ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో టీడీపీ మండలకన్వీనర్ కొండయ్య, సర్పంచ్ శివప్పనాయుడు, కూటమి నాయకులు సత్యవతమ్మ, దాసిరెడ్డి, కేశవరెడ్డి, నరసింహులు, ప్రశాంత్, రంగస్వామిరెడ్డి, చెన్నారెడ్డి, ఆనంద్, మాజీజడ్పీటీసీ శ్రీరాములనాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమాన్ని పట్టించుకోని కేతిరెడ్డి

- కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు సత్యకుమార్, బీకే పార్థసారధి



గరశనపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న సత్యకుమార్, పార్థసారథి, పరిటాలశ్రీరామ్

బత్తలపల్లి, ఏప్రిల్ 12: ధర్మవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే కేతిరెడ్డికి ప్రజాసంక్షేమం పట్టలేదని, ఎంతసేపూ అక్రమార్జనలోనే కాలం గడిపారని కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్, హిందూపురం పార్లమెంట్ కూటమి టీడీపీ ఎంపీ అభ్యర్థి పార్థసారథి విమర్శించారు. మండలంలోని గరశనపల్లి, దంపెట్ల, నల్లబోయనపల్లి, డి.చెర్లోపల్లి పంచాయతీల్లో శుక్రవారం వారు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి ప్రజలకు వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. కూటమి అధికారంలోకి వస్తే చేపట్టబోయే పథకాలను వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థికి కమలం గుర్తుకు, ఎంపీ అభ్యర్థికి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా సత్యకుమార్, పార్థసారధి మాట్లాడుతూ... మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. దేశంలో మిగతా రాష్ట్రాలు అభివృద్ధిలో పోటీ పడుతుంటే ఏపీ మాత్రం అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి అక్రమ సంపాదనపై దృష్టి పెట్టి ప్రజాసమస్యలను గాలికొదిలారని విమర్శించారు. ఎన్నికల్లో ఈయనకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజల్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోనుగుంట్ల విజయ్‌కుమార్, నారాయణరెడ్డి, చల్లాశ్రీనివాసులు, చితంబర్‌రెడ్డి , రవి, సురేంద్ర, నారాయణస్వామి, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

- ఎన్నికల ప్రచారంలో పల్లె సింధూర



జంబులవాండ్లపల్లిలో ఎన్నికల ప్రచారంలో పల్లె సింధూర

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 12: కూటమి అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరా పేర్కొన్నారు. మండలంలోని డబురువారిపల్లి పంచాయతీ బత్తినపల్లి, జంబులవాండ్లపల్లి, డబురువారిపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆమె భర్త పల్లె వెంకట కృష్ణకిశోర్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికి తిరిగి కూటమి అధికారంలోకి వస్తే చేపట్టనున్న సూపర్ సిక్స్‌పథకాలను ప్రజలకు వివరించారు. సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ చేపట్టిన అభివృద్ధి శూన్యమన్నారు. కూటమి అధికారంలోకి వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ప్రజలకు అందాల్సిన తాగునీటిని తన వ్యవసాయ పొలానికి మళ్లించుకున్నారంటే ఆయన పాలన ఏవిధంగా ఉందో స్పష్టమవుతోందన్నారు. ఆయన్ను ఇంటికి సాగనంపడానికి అందరం సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఆమెకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జడ్పీటీసీ ఓబులరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి వల్లెపు సోమశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, ఎంపీటీసీ శ్రీనివాసులు, నాయకులు జెరిపిటి అంజనప్ప, ఆర్ఎంపీ జాకీర్, బడిశం రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఓటమి ఖాయం: చిలకం మధు



విలేకరులతో మాట్లాడుతున్న చిలకం మధుసూదన్ రెడ్డి

ధర్మవరం, ఏప్రిల్ 12: వచ్చే ఎన్నికలలో రాష్ట్రంలో వైసీపీ ఓడిపోవడం ఖాయమని జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓటమి భయంతో వైసీపీ నేతలు మా అధినేత పవన్‌కల్యాణ్‌పై కారు కూతలు కూస్తే సహించేది లేదన్నారు. నోరు అదుపులో పెట్టుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్రంలో అరాచక పాలనను పారద్రోలడానికే పవన్‌కల్యాణ్ టీడీపీ,బీజేపీతో పొత్తు పెట్టుకున్నారని తెలిపారు. ఉమ్మడిజిల్లాలోని అన్నినియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామన్నారు. వైసీపీని ఇంటికి సాగనంపడమే జనసేన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

బాలయ్య పర్యటనకు తరలిరండి

పుట్టపర్తి/ నల్లమాడ, ఏప్రిల్ 12: హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ పుట్టపర్తి నియోజకవర్గంలో చేపట్టే పర్యటనను విజయవంతం చేయాలంటూ మాజీ మంత్రిపల్లె రఘునాథరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు. బాలకృష్ణ శనివారం సాయంత్రం 4గంటలకు నల్లమాడ మండలం బొగ్గలపల్లి వద్ద నియోజకవర్గంలోకి ప్రవేశిస్తారన్నారు. 5గంటలకు కొత్తచెరువులో బహిరంగసభలో ప్రసంగిస్తారన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు తరలిరావాలని కోరారు. అలాగే టీడీపీ నల్లమాడ మండల కన్వీనర్ మైలే శివశంకర్ కూడా బాలకృష్ణ పర్యటనను విజయవంతం చేయాలని ప్రకటనలో కోరారు.

తనకల్లు: నందమూరి బాలకృష్ణ కదిరి పట్టణంలోకి శనివారం వస్తున్నట్లు మండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆయన పర్యటనను విజయవంతం చేయడానికి మండలంలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తరలిరావాలని కోరారు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

ముదిగుబ్బ, ఏప్రిల్ 12: ధర్మవరం సెబ్ అధికారులు, పుట్టపర్తికి చెందిన డీటీఎఫ్ సిబ్బంది కలిసి శుక్రవారం మండలంలోని గరుగు తండాలో నాటు సారా తయారీ కేంద్రాలపై దాడులు చే శారు. గరుగుతండా అ టవీ ప్రాంతంలో నాటుసారా తయారీకి ఉపయోగించే 870 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ధర్మవరం సెబ్ ఇన్‌స్పెక్టర్ గురు ప్రసాద్ తెలిపారు.

సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం



బుక్కపట్నంలో సూపర్‌సిక్స్‌పై ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ శ్రేణులు

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 12: మండలంలోని రాయలవారిపల్లి 13వ వార్డులో టీడీపీ నాయకులు శుక్రవారం సూపర్‌సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ.. ప్రజలకు కరపత్రాలు పంచుతూ పథకాల గురించి వివరించారు. చంద్రబాబు సీఎం అయితే పథకాలన్నీ వెంటనే అమలువుతాయని చెప్పారు. పథకాల వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. వచ్చే ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరను, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అర్బన్ కన్వీనర్ రామాంజనేయులు, రాష్ట్ర ముస్లింమైనారిటీ విభాగం కార్యదర్శి షేక్ మహమ్మద్ రఫీ, మున్సిపల్ మాజీ చైర్మన్ బెస్తచలపతి, మాజీవైస్ఎంపీపీ చిమిరాల సుధాకర్, బూత్ కన్వీనరు గుట్లపల్లి గోవిందప్ప, జిల్లా బీసీసెల్ నాయకులు ఉప్పలపాటి తిరుపాల్, యూనిట్ ఇన్‌చార్జిలు ఉమాపతియాదవ్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు: మండలంలోని ఎర్రపల్లి గ్రామంలో టీడీపీ హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి సాలక్కగారి శ్రీనివాసులు నాయకులు, కార్యకర్తలతో కలిసి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఇంటింటా తిరిగి కరపత్రాలు పంచుతూ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల, పట్టణ కన్వీనర్లు, నాయకులు రామకృష్ణ, ఒలిపిశీన, కిష్టప్ప, వెంకటరాముడు, ఎర్రపల్లి రామకృష్ణ, చలపతి తదితరులు పాల్గొన్నారు..

బుక్కపట్నం: మండలకేంద్రంలో టీడీపీ నాయకులు సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డిని, ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండలకన్వీనర్ చింతా మల్లిరెడ్డి, నాయకులు జంగం వెంకటరాముడు, లావణ్యగౌడ్, సాకే యశోదా, మాజీ ఎంపీపీ బాలు తదితరులు పాల్గొన్నారు.

కొక్కంటి క్రాస్‌లో నేడు విద్యుత్ అంతరాయం

తనకల్లు, ఏప్రిల్ 12: మండలంలోని కొక్కంటి క్రాస్ సబ్ స్టేషన్ పరిధిలో ని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ ఏఈ శ్రీకాంత్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సరప రా నిలిపి వేయనున్నామన్నారు. విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

బీజేపీలోకి చేరిక

ముదిగుబ్బ, ఏప్రిల్ 12: మండలంలోని మర్తాడు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు బీజేపీలోకి చేరారు. బత్తలపల్లి మండలం కట్టకిందపల్లి గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం చేస్తున్న కూటమి అభ్యర్థి సత్యకుమార్‌ను వారు ముదిగుబ్బ ఎంపీపీ గొడ్డుమర్రి ఆదినారాయణ యాదవ్ ఆధ్వర్యంలో కలిసి బీజేపీ తీర్థం తీసుకున్నారు. వారికి సత్యకుమార్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో ప్రభాకర్ రెడ్డి, కురుబ చంద్రశేఖర్, చంద్రమోహన్, తిరుపాల్ తదితరులు ఉన్నారు.

ద్విచక్రవాహనాల ఢీ.. ఆరుగురికి గాయాలు

గోరంట్ల, ఏప్రిల్ 12: పట్టణంలోని కదిరి రోడ్డులో ఉన్న టీవీఎస్ షోరూమ్ వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో శశిభూషణ్‌తోపాటు, విద్యార్థులు రాజ్‌కుమార్, తేజశ్విని, లోక్‌నాథ్‌రెడ్డి, లిఖిత్, జశ్వంత్ తీవ్రంగా గాయపడ్డారు. మలసముద్రం గ్రామానికి చెందిన శశిభూషణ్ గోరంట్లలో నివాసముంటూ చేనేత మగ్గం ద్వారా జీవనం సాగిస్తున్నారు. గోరంట్లలోని ఎస్కేఆర్ పాఠశాలలో కుమారై తేజశ్విని, కుమారుడు రాజ్‌కుమార్ చదువుతున్నారు. శుక్రవారం పాఠశాల వదలగా శశిభూషణ్ ఇద్దరు పిల్లలను ద్విచక్రవాహనంపై ఇంటికి తీసుకెళ్తుండగా, ప్రమాదం చోటు చేసుకుంది. ఇదే పాఠశాలకు చెందిన లిఖిత్ ద్విచక్రవాహనంపై స్నేహితులు జశ్వంత్, లోక్‌నాథ్‌రెడ్డిలను ఎక్కించుకుని స్వగ్రామాలకు వెళ్తుండగా, రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో రెండువాహనాలు ఢీకొన్నాయి. శశిభూషణ్ పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు తరలించారు. రాజ్‌కుమార్, తేజశ్వనితోపాటు తిప్పరాజుపల్లికి చెందిన లోక్‌నాథ్‌రెడ్డి, పూలచెట్లపల్లికి చెందిన 8వతరగతి చదువుతున్న లిఖిత్, బూదిలివాండ్లపల్లికిచెందిన 9వతరగతి జశ్వంత్ గాయపడిన వారిలో ఉన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

నల్లమాడ, ఏప్రిల్ 12: మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రికార్డులు పరిశీలించారు. పాతకేసులు త్వరగా పరిష్కరించాలని సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్, ఎస్ఐ రమేష్‌బాబ్‌కు సూచించారు. అలాగే ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక గ్రామాల్లో గట్టి నిఘా ఉంచాలని, అనుమానం ఉన్న ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

భర్త, అత్తమామలపై వేధింపుల కేసు

గోరంట్ల, ఏప్రిల్ 12: మండలంలోని వానవోలు గ్రామానికి చెందిన బోయ మంజుల ఫిర్యాదు మేరకు భర్త నరసింహమూర్తి, అత్త అంజనమ్మ, మామ లక్ష్మీనర్సప్పలపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. మంజులకు చాలకాలంగా సంతానం కలగకపోగా, భర్త తరచూ తాగి వేధించేవాడన్నారు. అత్తమామలు, భర్త అదనపు కట్నం కోసం చిత్రహింసలకు గురిచేసేవారన్నారు. మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టీడీపీలోకి 15 కుటుంబాల చేరిక

నల్లచెరువు, ఏప్రిల్ 12: మండలంలోని ఓరువాయి పంచాయతీ మద్దెపల్లి ఎస్సీకాలనీకి చెందిన 15కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కదిరి పట్టణంలోని కందికుంట వెంకట ప్రసాద్ నివాసంలో శుక్రవారం వారు ఆయన సమక్షంలో టీడీపీలోకి చేరారు. వారికి కందికుంట కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. చేరిన వారిలో ఎం. నారాయణ, తిరుపాల్, వెంకటాద్రి, సూరి, ప్రేమ, చిన్ని, రవి, అంజి, నాగేంద్ర, విజయ, వీరాంజి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజశేఖర్, నాయకులు రమణారెడ్డి, దేవేంద్రగౌడ్, సతీష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో కందికుంట

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల ప్రతిభ


కె.లోకేష్


కె.రాజేష్


ఎమ్.బాలాజీ


ఎమ్.ఎస్.మిథున్


ఎమ్.హేమంత్


ఆర్.బాలాజీ

మడకశిరటౌన్, ఏప్రిల్ 12: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో మహాత్మా జ్యోతిరావుఫూలే గురుకుల కళాశాల విద్యార్థులు ప్రతిభను చాటారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 101 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 99 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 88 మందికి 84 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ మురళీధర్‌రావు తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో కె.లోకేష్ 951 మార్కులు సాధించి నియోజకవర్గ టాపర్‌గా నిలిచారు. బైపీసీలో కె.రాజేష్ 940 మార్కులు సాధించారు. సీఈసీలో ఎం.బాలాజీ 933 మార్కులు సాధించగా మొదటి సంవత్సరం ఎంపీసీలో ఎం.ఎస్.మిథున్ 461 మార్కులు, బైపీసీలో ఎం.హేమంత్ 414, సీఈసీలో ఆర్.బాలాజీ 458 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అలాగే మడకశిర జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంసీపీలో 46 శాతం, బైపీసీలో 45 శాతం, హెచ్ఈసీలో 36 శాతం, సీఈసీలో 47 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 17 మందికి 10 మంది, బైపీసీలో 33 మందికి 20 మంది, హెచ్ఈసీలో 34 మందికి 22 మంది, సీఈసీలో 16 మందికి ఎనిమిది మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో మేఘన 915 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. బైపీసీలో కె.తేజ 939 మార్కులు, సీఈసీలో కె.దివ్య 887 మార్కులు, హెచ్ఈసీలో జి.హరీష్ 907 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు.

66 శాతం ఉత్తీర్ణత


సాయిభార్గవ్


స్వాతి


నందిని


పావని

రొద్దం: స్థానిక జూనియర్ కళాశాలలో 61మంది విద్యార్థులకు గాను 40మంది ఉత్తీర్ణులై 66 శాతం పలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ మద్దిలేటి తెలిపారు శుక్రవారం ఇంటర్ బోర్డు ఫలితాలు ప్రకటించగా ప్రథమ సంవత్సరంలో 71 మందికి 25మంది ఉత్తీర్ణులైనట్లు ఆయన తెలిపారు. ఎంపీసీలో 961తో సాయిభార్గవ్ కాలేజీ టాపర్‌గా, బైపీసీలోస్వాతి 892 మార్కులతో ద్వితీయ స్థానంలో సీఈసీలో ఆరుగురు, హెచ్ఈసీలో ఆరుగురు ఉత్తీర్ణత సాధించారన్నారు. కస్తూరిబాలో నందిని 912మార్కులతో ప్రథమస్థానం రాగా, మొదటి సంవత్సరంలో పావని 438 మార్కులతో ప్రథమస్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ నాగరత్నమ్మ తెలిపారు.

బాలికలదే పైచేయి

చిలమత్తూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయిగా నిలిచింది. శుక్రవారం విడుదలైన ఫలితాల్లో మొదటి సంవత్సరంలో 60.3 శాతం, రెండో సంవత్సరం 85 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ భీమానాయక్ తెలిపారు. మొదటి ఇంటర్ ఎంపీసీలో బిందు 449 మార్కులు, బైపీసీలో శ్రావణి 414, మమత హెచ్ఈసీలో 425 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఒకేషనల్ గ్రూప్స్‌లో ఓఏఎస్‌లో వీణా 442, ఏ అండ్ టీలో అఖిల్ 469 మార్కులు సాధించినట్లు తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో అర్చన 937, బైపీసీలో రజని 872, హెచ్ఈసీలో అశ్విని 866 సాధించారన్నారు. ఒకేషనల్ కోర్సుల్లో సభా 861, మౌనిక 962 మార్కులు సాధించారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

గోరంట్ల: మండలంలోని ఖాజాపురం కేజీబీవీలో ద్వితీయ సంవత్సరం సీఈసీలో 21మందికి గాను 20మంది ఉత్తీర్ణత సాధించారు. పుష్పరాణి 860మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ శిరీషా తెలిపారు. మొదటిసంవత్సరంలో 28మందికి 23మంది ఉత్తీర్ణత సాధించగా మౌనికకు 444 మార్కులు సాధించింది. ఎస్ఏపీఎస్, ఎయిడెడ్ కళాశాలల్లో ద్వితీయ సంవత్సరంలో 76 మందికి 66 మంది ఉత్తీర్ణతకాగా ఎంపీసీలో దినేష్, కార్తిక్ 823 మార్కులు సాధించారు. మొదటి సంవత్సరంలో 115మందికి 64మంది ఉత్తీర్ణులుకాగా, ఎంపీసీలో సాయిసుధీక్ష 449 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఆడవాలసూర్యనారాయణ తెలిపారు.


పుష్పారాణి


మౌనిక

రొళ్ల: మండలంలోని కేజీబీవీ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో సత్తా చాటారు. ఆర్.స్పందన 923 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ మునవర్‌జాన్ తెలిపారు. 29 మంది విద్యార్థులకు గాను 26 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. చందన 921 సాధించినట్లు తెలిపారు.

వంద శాతం ఉత్తీర్ణత

గుడిబండ: ఇంటర్మీడియట్ ఫలితాల్లో మహాత్మాజ్యోతిరావు పూలే కళాశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 103 మందికిగాను 103 విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 99 మందికి గాను 99 మంది ఉత్తీర్ణత సాధించారు. గుడిబండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 75 మందికి 42 మంది, ద్వితీయ సంవత్సరంలో 60 మందికి 45 మంది ఉత్తీర్ణత సాధించారు. కేజీబీవీ కళాశాలలో మొదటి సంవత్సరం ఏడుగురికి ఐదుగురు ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 10 మందికి 9 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీ, రామకృష్ణనాయక్ తెలిపారు.

'మద్య నిషేధం అంటూ.. లూటీ'


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

హిందూపురం, ఏప్రిల్ 12: మద్యపానాన్ని నిషేస్తామంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహనరెడ్డి ఇచ్చిన హామీని తుంగలో తొక్కి లక్ష కోట్ల వరకు లూటీ చేశారని టీడీపీ నాయకులు ఆరోపించారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసం వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ కల్తీ మద్యంతో మహిళల మంగళసూత్రాలు తెంచారని, జే్‌బ్రాండ్ల ద్వారా ప్రజల సొమ్ము దోచుకున్నాడన్నారు. నిషేధం మాట పక్కన పెట్టి మరో 20 ఏళ్ల మద్యపాన నిషేధం కాకుండా దానిపై అప్పులు తెచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. పట్టణాధ్యక్షులు రమేష్, అమరనాథ్, రాము, బాచీ, సుమో శీన, నవీన్, అమీన్, యుగంధర్, చౌదరి పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 12: పట్టణంలోని మడకశిర రహదారిలో సర్వే నెం.668 భూమిలో అక్రమ కట్టడాలను రెవెన్యూ, పోలీసులు శుక్రవారం తొలగించారు. మడకశిర రహదారిలో మెడికల్ కళాశాల ఎదురుగా అనధికారికంగా కొంతమంది ప్రొద్దులంతో గుడిసెలు వేసుకొని ఏకంగా పునాదులు వేసి ఇళ్లు నిర్మించేందుకు పూనుకున్నారు. తహసీల్దార్ విజయరామరాజు, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, సీఐ యుగంధర్, సిబ్బందితో వెళ్లి ఎక్స్‌కవేటర్ల సాయంతో అక్రమ కట్టడాలను తొలగించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో అక్రమ కట్టడాలు నిర్మిస్తే చట్టరీత్యా నేరమన్నారు.


ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన ఇంటిని తొలగిస్తున్న అధికారులు

చెత్తతో సంపద ఉత్తిదే..!

- దిష్టిబొమ్మల్లా చెత్తతో సంపద కేంద్రాలు
- ఐదేళ్లుగా నయాపైసా ఆదాయం లేని వైనం
- గ్రామీణ ప్రాంతాల్లో ఆగిపోయిన చెత్త సేకరణ


కోడూరు తోపులో ఏర్పాటుచేసిన చెత్తతో సంపద కేంద్రం

చిలమత్తూరు, ఏప్రిల్ 12: పల్లెలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం పల్లెప్రగతి కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా గ్రామాల్లో చెత్తను సేకరించి తద్వారా వానపాముల సేంద్రియ ఎరువు తయారీతో పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావించింది. ఆదిశగా ప్రతి గ్రామ పంచాయతీలో చెత్తతో సంపద కేంద్రాలను రూ.7.5 లక్షలతో షెడ్లను నిర్మించింది. గ్రామాల్లోని అపరిశుభ్రతను రోజువారిగా తొలగిస్తూ ఆ చెత్తను పొడి, తడిగా వేరు చేసి కేంద్రాలకు తరలిస్తారు. కేంద్రాల్లో చెత్తను కంపోస్టుగా మార్చి అందులో వానపాములను పెంచాలి. వానపాముల ద్వారా ఉత్పత్తయ్యే సేంద్రియ ఎరువును రైతులకు విక్రయించి పంచాయతీలకు ఆదాయాన్ని సమకూర్చుకోవాలి. లక్ష్యం గొప్పదే అయినా దానిని అమలుచేసే అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా నీరుగారిపోతోంది.

దిష్టిబొమ్మల్లా చెత్తతో సంపద కేంద్రాలు

వైసీపీ పాలనలో ఆర్థికంగా దివాలా తీసిన పంచాయతీలు కనీసం చెత్తతో సంపద కేంద్రాలను కూడా సక్రమంగా నిర్వహించలేకపోయాయి. కేంద్రాలకు చెత్తను సేకరించే స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు ఇవ్వడంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతుండటంతో వారు చెత్త సేకరణకు ససేమిరా అంటున్నారు. దాంతో కేంద్రాలకు చెత్త చేరడం అటుంచితే పల్లెల్లో ఏ వీధిలో చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. చెత్త సేకరణ జరగకపోవడంతో వానపాముల పెంపకం మాటలకే పరిమితమైంది. దాంతో వర్మీకంపోస్టు తయారీ ఒక కలగానే మిగిలిపోయింది. మండలంలోని 12 పంచాయతీల్లో ఈ కేంద్రాలు దిష్టి బొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.


నిరుపయోగంగా ఉన్న వర్మీకంపోస్టు కేంద్రం

ఐదేళ్లుగా నయాపైసా ఆదాయం లేదు

ఈ చెత్తతో సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఐదేళ్లుగా ఒక్క నయాపైసా ఆదాయం లేకపోయిందనే చెప్పాలి. కనీసం చెత్తను సేకరించే కార్మికుల వేతనాలు ఇచ్చేందుకు కూడా ఈ కేంద్రాలు ఉపయోగపడలేదని తెలుస్తోంది. కేవలం అలంకార ప్రాయంగా మారాయనడంలో సందేహం లేదు. వర్మీకంపోస్టుకి రైతుల నుంచి డిమాండ్ బాగానే ఉంది. కానీ దానిని తయారుచేసే విధానంలో నాణ్యత పాటించకపోవడంతో రైతులు ఆసక్తి చూపడం లేదు. బయట మార్కెట్లో వర్మీకంపోస్టు కిలో ఎరువు రూ.50 వరకు పలుకుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకొని కేంద్రాల నిర్వహణపై శ్రద్ధ చూపితే పంచాయతీలకు ఆదాయం గణనీయంగా వచ్చే అవకాశం ఉంది. దాంతో పాటు పల్లెలు కూడా పరిశుభ్రంగా మార్చేందుకు వీలు కలుగుతుంది.

పల్లెల్లో ఆగిన చెత్త సేకరణ

పంచాయతీల్లో కార్మికులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి ఉండటంతో అభివృద్ధి పనులు కూడా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. నిధుల లేమితో చెత్తతో సంపద కేంద్రాల నిర్వహణ పంచాయతీలకు భారమైంది. దీంతో కార్మికులకు వేతనాలు సకాలంలో ఇవ్వకపోవడంతో కార్మికులు మొండికేస్తున్నారు. పల్లెల్లో చెత్త పేరుకుపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

టీడీపీతోనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 12: టీడీపీతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని మాజీ జడ్పీటీసీ దనాపురం సూర్యనారాయణ, ఎంపీపీ సత్యనారాయణలు పేర్కొన్నారు. శుక్రవారం పరిగి మండల పెద్దరెడ్డిపల్లి, కొడిగేపల్లి తదితర ప్రాంతాల్లో టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు ఇటింటి ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ ఐదేళ్ల ప్రజలు రాక్షస పాలనలో కొనసాగారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క ఛాన్స్ పేరుతో రాష్ట్రాన్ని దివాలా తీయించి 20 ఏళ్ల వెన్నకు నెట్టారని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు కావాలంటే అనుభవం ఉన్న చంద్రబాబును సీఎం చేయాలని కోరారు. పెనుకొండ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యేగా సవితను, ఎంపీగా పార్థసారథిలను గెలిపించాలని ప్రజలను కోరారు. టీడీపీ నాయకులు సోమప్ప, మారుతి, బీజేపీ చంద్ర, జనసేన సురేష్ పాల్గొన్నారు.

ఎర్రమంచిని ప్రపంచపటంలో నిలిపిన వ్యక్తి చంద్రబాబు

పెనుకొండ రూరల్: మారుమూల గ్రామమైన ఎర్రమంచిని కియ కార్లపరిశ్రమ నెలకొల్పి ప్రపంచ పటంలో ప్రత్యేక స్థానం కల్పించిన వ్యక్తి చంద్రబాబు అని మాజీ ఎంపీపీ కేశవయ్య, సింగ్ విండో మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడి అన్నారు. శక్రవారం మండలంలోని కురువాండ్లపల్లిలో టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పతకాలను ప్రజలకు వివరించారు. మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు యాదవ్, చిన్నవెంకటరాముడు, బిజి పాళ్యం శీన, బోయనాగరాజు, సుబ్బరాయుడు, పోతిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.


పరిగిలో ఇంటింటి ప్రచారంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

రొద్దం: సూపర్ సిక్స్ పథకాలపై టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శుక్రవారం మండలంలోని రాచూరు, జక్కలచెరువు, నాగిరెడ్డిపల్లి, కనుమర, నారనాగేపల్లి తదితర గ్రామాల్లో ఇంటింటికెళ్లి చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. వైసీపీ వారి మాటలు నమ్మక సైకిల్ గుర్తుకుఓటు వేసి గెలిపించాలని ప్రజలను ఓటు అభ్యర్థించారు. కూటమి ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారధి, ఎమ్మెల్యే అభ్యర్థి సవితలకు ఓటు వేసి గెలిపించాలన్నారు. మాధవనాయుడు, జీవీ నాయుడు, చంద్రమౌళి, నరసింహులు, సుబ్బరత్నమ్మ, నరహరి, సర్పంచ్ నాగరాజు, హరి, మాజీ సర్పంచ్‌లు నాగభూషణం, మనోహర్, హరీష్, పుల్లప్ప, శ్రీనాథ్‌చౌదరి, టైలర్ ఆంజనేయులు, హనుమంతు, కోళ్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం అర్బన్ ఏప్రిల్ 12: విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా శనివారం హిందూపురం సబ్‌డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈఈ మహేష్‌కుమార్ తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ముద్దిరెడ్డిపల్లి సెక్షన్, కొట్నూరు సబ్ స్టేషన్ పరిధిలోని కొల్లకుంట, కొట్నూరు, చిన్నగుడ్డంపల్లి, పెద్దగుడ్డంపల్లి, నందమూరినగర్, కగ్గల్లు, ఎం. బీరేపల్లి గ్రామాల్లో ఈ సమయంలో విద్యుత్ ఉండదన్నారు. అలాగే పట్టణ పరిధిలోని ఇండోర్ విద్యుత్ కేంద్ర పరిధిలోని 33, 11 కేవీ లైన్లు మరమ్మతు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. పట్టణంలోని పాండురంగనగర్, కంసలపేట, అంబేద్కర్‌నగర్, కోట, రైల్వేస్టేషన్‌రోడ్డు, బాలాజీ సర్కిల్, ముక్కడిపేట, డిఎల్ రోడ్డు, వీడీ రోడ్డు, కోర్టు ఏరియా, ఆజాద్‌పేట, అంబేద్కర్ సర్కిల్, మెయిన్ బజార్, ఆజాద్ నగర్, సత్యనారాయణపేట, ఎంఎఫ్ రోడ్డు, చెక్కిటకార్ ప్రాంతం, బోయపేట, టిప్పుఖాన్ స్ట్రీట్, నింకంపల్లిరోడ్డు, బాలాజీనగర్, గాంధీ నగర్, హస్నాబాద్ పరిగిరోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డి-1 ఏఈఈ నారాయణస్వామి ఒక ప్రకటనలో తెలిపారు.

మడకశిరటౌన్: అగళి మండలంలోని పలు సబ్ స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డీఈ భూపతి తెలిపారు. అగళి, మధూడి, హెచ్.డి.ఎన్.హళ్లి ఉప కేంద్రాల పరిధిలో 33 కేవీ లైన్ అత్యవసర మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం


అమ్మవారి జ్యోతులను మోసుకెళుతున్న భక్తులు

పెనుకొండ టౌన్, ఏప్రిల్ 12: సోమందేపల్లి గ్రామంలో తొగటవీర క్షత్రీయ, దేవంగ కులస్తుల ఆధ్వర్యంలో చౌడేశ్వరీదేవి జ్యోతుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ప్ర త్యేక అలంకరణ, పూజ లు, హోమాలు నిర్వహించారు. ఉదయం పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు డీసీ ఈశ్వరయ్య, సతీమణి రత్నమ్మ ప్రత్యేకంగా చేయించిన వెండి కత్తిని అమ్మవారికి బహూకరించారు. డీసీ వెంకటేష్, డీసీ అశోక్ తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో జరిగిన అమ్మవారి జ్యోతుల ఉత్సవాల్లో పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పాల్గొన్నారు. ఆమెకు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఈశ్వరయ్య, వెంకటేశులు శాలవతో సన్మానించారు.

బొమ్మలను మూసివేశారు

మడకశిర రూరల్, ఏప్రిల్ 12: మండలంలో కదిరేపల్లి, సీ కొడిగేపల్లి గ్రామ సచివాలయాల గొడలపై ఉన్నా సీఎం బొమ్మలను అధికారలు మూసివేశారు. ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కోడ్ అమలుపై అధికారల ని ర్లక్ష్యం అనే కథనానికి ఉన్నతాధికారలు స్పందించారు. సంబంధిత సచివాలయాల అధికారలుకు ఎన్నికల అధికారలు నోటీసులు పంపడంతో వారు వెం టనే స్పందించారు. గొడలపై ఉన్న సీఎం బొమ్మలను మూసివేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


కదిరేపల్లి సచివాలయంపై ఉన్న సీఎం బొమ్మను మూసివేసిన అధికారలు

టీడీపీతోనే బీసీలకు భరోసా

రొళ్ల, ఏప్రిల్ 12: టీడీపీతోనే బీసీలకు భరోసా అని రాష్ట్ర వక్కలిగ సాధికార కన్వీనర్ ఈఎం పాండు అన్నారు. మండలంలోని బీసీ నాయకులతో కలిసి జయహో బీసీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీసీలు అంటే టీడీపీ, టీడీపీ అంటే బీసీలు అని బీసీలు వైసీపీకి గుణపాఠం చెప్పాలన్నారు. కలిసికట్టుగా పనిచేసి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. బీసీలంతా ఐక్యంగా పనిచేసి టీడీపీని అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రవిభూషణ్, రొళ్ల పంచాయతీ అధ్యక్షులు శివన్న, హొట్టేబెట్ట పంచాయతీ అధ్యక్షులు రంగప్ప, సీనియర్ లీడర్ ఆదెప్ప, తిమ్మరాజు, రవికుమార్, చిక్కన్న, సన్నమారేగౌడ్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

మడకశిరటౌన్, ఏప్రిల్ 12: నియోజకవర్గంలో శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. మడకశిర పట్టణంలో టీడీపీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన బైక్ ర్యాలీలో అపశృతి చోటు చేసుకుంది. మడకశిర నుంచి రొళ్లకు బైక్‌ర్యాలీ వెళుతున్న సమయంలో పట్టణ సమీపంలోని వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల వద్ద అమరాపురం మండలం ఆలదపల్లి గ్రామానికి చెందిన సతీష్(30) డివైడర్‌ను ఢీకొని మృతి చెందాడు. ద్విచక్రవాహనంలో ఉన్న మరో వ్యక్తి అరుణ్‌కు తీవ్రగాయాలు కాగా మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హిందూపురం ప్ర భుత్వ ఆస్పత్రికి తరలించినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, తల్లి ఉన్నట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న

మృతుడి కుటుంబ సభ్యులకు పరామర్శ: బైక్ ర్యాలీలో మృతి చెందిన సతీష్ కుటుంబ సభ్యులను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, నాయకులు ఓదార్చారు. విషయం తెలుసుకొన్న వెంటనే మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికివెళ్లి మార్చురీలో ఉన్న సతీష్ మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం తల్లిని ఓదార్చారు. అలాగే మాజీ ఎమ్మెల్యే ఈరన్న సతీష్ మృతి చెందడం పార్టీకి తీరని లోటు అన్నారు. వారి కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకొంటామని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రమాదంలో గాయపడిన అరుణ్‌కు మెరుగైన చికిత్సలు అందించాలని వైద్యులకు సూచించారు.

రొళ్లలో వ్యక్తి మృతి

రొళ్ల: మండల కేంద్రంలోని సెంట్ ఫ్యాక్టరీ వెనకభాగం హైవే రోడ్డులో శుక్రవారం రాత్రి 8.30 గంటల సమయంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. గిడ్డబొమ్మనహళ్లి గ్రామానికి చెందిన హనుమంతప్ప(50) రోడ్డుపై మరో ఇద్దరితో కలిసి నడుచుకుంటూ వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలు కావడంతో గుర్తించిన స్థానికులు అగళి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలాల్సి ఉంది.

అరాచక పాలనను అంతమొందించండి: సవిత


ఎన్నికల ప్రచారం చేస్తున్న సవిత

గోరంట్ల, ఏప్రిల్ 12: వైసీపీ అరాచక పాలనను అంతమొందించాలంటే ప్రతి ఒకరు సైకిల్‌గుర్తుపై ఓటు వేసి బటన్‌రెడ్డిని సాగనంపాలని కూటమి అభ్యర్థి సవిత పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని 1, 2 వార్డుల్లో ఆమె విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రతిఇంటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ సూపర్ సిక్స్‌పథకాల గురించి వివరించారు. టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అప్పట్లో జరిగిన పనులే ఎక్కడ చూసినా కనిపిస్తున్నాయన్నారు. ఎన్నికల ముందు జగన్ ఎన్నో హామీలిచ్చినా వాటిని నేరవేర్చకపోగా, టీడీపీ అవలంభిస్తున్న పథకాలను తుంగలో తొక్కిన ఘనత జగన్మోహన్‌రెడ్డిదే అన్నారు. నిమ్మల విద్యాధరణి, నిమ్మల చంద్రశేఖర్, నిమ్మల యువశేఖర్, కన్వీనర్ సోముశేఖర్, కక్కల రఘు, బెల్లాలచంద్ర, సుబ్బు, నరేష్, కొత్తపల్లి నరసింహప్ప, వేణు, జయరాం, సుధాకర్‌రెడ్డి, బాలక్రిష్ణచౌదరి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీడీపీలోకి 30 కుటుంబాల చేరిక

పెనుకొండ టౌన్: రొద్దం మండలం శేషాపురంగ్రామం, భూదిపల్లిగ్రామాల నుంచి 30 వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. శేషాపురం గ్రామానికి చెందన అరుణ్‌రెడ్డి ఆధ్వర్యంలో బాబు, ఆర్ వెంకటరాముడు, వెంకటేశులు, చలపతి, రామాంజి ముత్యాలప్ప, రవి, అనీల్‌రెడ్డి రామాంజినరెడ్డిలు చేరారు. వీరు మాట్లాడుతూ గ్రామాల్లో చిన్న సమస్యలు కూడా వైసీపీ పరిష్కరించలేదన్నారు. ఇలాంటి పార్టీ వెంట ఉంటే గ్రామాలు కనుమరుగు అవడం ఖాయమన్నారు.

టీడీపీ గెలుపు ఖాయం

- ఉమ్మడి అభ్యర్థి సునీల్‌కుమార్


బైక్‌ర్యాలీలో పాల్గొన్న సునీల్‌కుమార్

మడకశిర టౌన్, ఏప్రిల్ 12: వైసీపీ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఈ ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయమని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని చంద్రమౌళేశ్వరస్వామి ఆలయం నుంచి బైక్‌ర్యాలీని మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్నతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అరాచకాలను వివరించడంలో భాగంగానే బైక్ ర్యాలీని ఐదు మండలాల పరిధిలో చేస్తున్నట్లు తెలిపారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన సంపూర్ణ మద్య నిషేధంతోపాటు అనేక వాగ్దానాలను నెరవేర్చలేదని ప్రజలకు వివరిస్తామన్నారు. కర్ణాటక మద్యాన్ని వైసీపీ నాయకులు అమ్ముకొంటూ సొమ్ము చేసుకొంటున్నారని, ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కూడా మద్యం అమ్ముతున్నాడని కేసు కూడా నమోదైనట్లు తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

నేడు పురానికి వసుంధరాదేవి రాక

హిందూపురం, ఏప్రిల్ 12: హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర దేవి శనివారం హిందూపురం రానున్నారు. ఉదయం 11 గంటలకు ఇక్కడికి చేరుకొని 12 గంటలకు సూగూరు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. అక్కడి నుంచి చిలమత్తూరు మండలం సోమఘట్ట నరసింహస్వామి ఆలయంలో పూజలు చేస్తారు. అనంతరం కొక్కవాండ్లపల్లి, సోమఘట్ట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 7 గంటల వరకు పలగలపల్లిలో, 7.45 గంటల నుంచి 8.30 గంటలకు వరకు చాగలేరు గ్రామాల్లో ప్రచారంలో పాల్గొంటారు.

ఏపీ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

- సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి


రోడ్ షోలో పాల్గొన్న రఘువీరారెడ్డి, సుధాకర్ తదితరులు

గుడిబండ, ఏప్రిల్ 12: ఆంధ్రరాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మాజీ మంత్రి సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.సుధాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కె.ఎస్.పల్లి, చిగతుర్పి, తాళికెర, టీ.డి.పల్లి, బళ్లేకట్ట తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించి హస్తం గుర్తుకు ఓటువేసి సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నాగరాజు, నాయకులు ఎల్.కె.నరసింహప్ప, నాయకులు నాగభూషణ, డి.హెచ్.రాయుడు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాల ఢీ.. ఆరుగురికి గాయాలు

గోరంట్ల, ఏప్రిల్ 12: పట్టణంలోని కదిరి రోడ్డులో ఉన్న టీవీఎస్ షోరూమ్ వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో శశిభూషణ్‌తోపాటు, విద్యార్థులు రాజ్‌కుమార్, తేజశ్విని, లోక్‌నాథ్‌రెడ్డి, లిఖిత్, జశ్వంత్ తీవ్రంగా గాయపడ్డారు. మలసముద్రం గ్రామానికి చెందిన శశిభూషణ్ గోరంట్లలో నివాసముంటూ చేనేత మగ్గం ద్వారా జీవనం సాగిస్తున్నారు. గోరంట్లలోని ఎస్కేఆర్ పాఠశాలలో కుమార్తె తేజశ్విని, కుమారుడు రాజ్‌కుమార్ చదువుతున్నారు. శుక్రవారం పాఠశాల వదలగా శశిభూషణ్ ఇద్దరు పిల్లలను ద్విచక్రవాహనంపై ఇంటికి తీసుకెళ్తుండగా, ప్రమాదం చోటు చేసుకుంది. ఇదే పాఠశాలకు చెందిన లిఖిత్ ద్విచక్రవాహనంపై స్నేహితులు జశ్వంత్, లోక్‌నాథ్‌రెడ్డిలను ఎక్కించుకుని స్వగ్రామాలకు వెళ్తుండగా, రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో రెండువాహనాలు ఢీకొన్నాయి. శశిభూషణ్ పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు తరలించారు. రాజ్‌కుమార్, తేజశ్వనితోపాటు తిప్పరాజుపల్లికి చెందిన లోక్‌నాథ్‌రెడ్డి, పూలచెట్లపల్లికి చెందిన 8వతరగతి చదువుతున్న లిఖిత్, బూదిలివాండ్లపల్లికిచెందిన 9వతరగతి జశ్వంత్ గాయపడిన వారిలో ఉన్నారు.

వృద్ధుడికి గాయాలు

గోరంట్ల, ఏప్రిల్ 12: మండలంలోని హిందూపురం రహదారి మల్లాపల్లి వద్ద ద్విచక్రవాహనం ఢీకుని చిన్నప్ప అనే వృద్ధుడు గాయపడ్డారు. మల్లాపల్లికి చెందిన వృద్ధుడు రోడ్డు పక్కన నిలబడి ఉండగా, పుట్టపర్తికి చెందిన హరి, అనిల్ ద్విచక్రవాహనంపై వెళ్తుతూ ఢీకొన్నారు. ప్రమాదంలో గాయపడిన చిన్నప్ప అపస్మారక స్థితిలో ఉండగా, హరి, అనిల్ కుమార్ స్వల్పంగా గాయపడ్డారు. గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ముగ్గురికి చికిత్సలు నిర్వహించగా, చిన్నప్ప పరిస్థితి విషయంగా ఉండడంతో 108లో బెంగళూరు తరలించారు.

భర్త, అత్తమామలపై వేధింపుల కేసు

గోరంట్ల, ఏప్రిల్ 12: మండలంలోని వానవోలు గ్రామానికి చెందిన బోయ మంజుల ఫిర్యాదు మేరకు భర్త నరసింహమూర్తి, అత్త అంజనమ్మ, మామ లక్ష్మీనర్సప్పలపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. మంజులకు చాలకాలంగా సంతానం కలగకపోగా, భర్త తరచూ తాగి వేధించేవాడన్నారు. అత్తమామలు, భర్త అదనపు కట్నం కోసం చిత్రహింసలకు గురిచేసేవారన్నారు. మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమ మద్యం పట్టివేత

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 12: కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. రామగిరి మండలం సుద్దకుంటపల్లికి చెందిన చంద్రమౌళినాయక్, లక్ష్మానాయక్ ఇరువురు కలిసి కర్ణాటక నుంచి కారులో అక్రమంగా మద్యం తరలిస్తుండగా సీఫారం వద్ద వాహనాల తనిఖీలు చేస్తుండగా మద్యం లభించిందన్నారు. 21 బాక్సుల్లో 2016 టెట్రా ప్యాకెట్లు పట్టుపడాయన్నారు. మద్యంతో పాటు వాహనం సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.